

# ఘనంగా బిర్సాముండ జయంతి వేడుకలు

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకొని "జన జాతీయ గౌరవ దినోత్సవాన్ని శనివారం మండలంలోని లింగట్ల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బిర్సాముండా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదికర్మ యోగి అభియాన్ బ్లాక్ మాస్టర్ ట్రేని జాదవ్ తానాజీ మాట్లాడుతూ భారతదేశ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు, వలసవాద వ్యతిరేకి అయిన భగవాన్ బిర్సాముండా జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతియేటా నవంబర్ 15న జన జాతీయ గౌరవ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన వీరుల త్యాగాలను స్మరించుకోవడం, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటం మనందరి బాధ్యత అని అన్నారు. ఆదికర్మ యోగి అభియాన్ పథకం ద్వారా గిరిజన అభివృద్ధి కోసం రూ.80వేల కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ టి సునీల్ ఠాకూర్, ఉపాధ్యాయులు మోతిలాల్, గ్రామ పటేల్ పెందూర్ అసే రావు, భీమరావు, సంతోష్, అనంతరావు, మెర్వాన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# మెడికల్ యజమాని నిజాయితీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని డీసెంట్ మెడికల్ యజమాని మొహమ్మద్ జాహేద్ తనకు దొరికిన డబ్బును బాధితునికి అందించి నిజాయితీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చిన్నబుగ్గారం గ్రామానికి చెందిన రాథోడ్ సోమ్లా అనే వృద్ధుడు ఈనెల 11న మెడికల్ షాప్ కు వచ్చి మందులు తీసుకున్నాడు. ఈ క్రమంలో తనవద్ద ఉన్న రూ.4వేలు మరిచి వెళ్ళిపోయాడు. దీన్ని గమనించిన యజమాని జాహేద్ ఆ డబ్బులను పోగుటుకున్న వ్యక్తి వస్తే ఇస్తానని తన వద్ద ఉంచాడు. శనివారం వృద్ధుడు మెడికల్ షాప్ కు వచ్చి డబ్బులు పోగుట్టుకున్నానని చెప్పాడు. సీసీ ఫుటేజీను పరిశీలించి డబ్బులు ఆ వృద్ధునికి అందించి యజమాని నిజాయితీ చాటుకున్నాడు. అదిచూసిన పలువురు మెడికల్ యజమానిను అభినందించారు.

# విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని లఖంపూర్ గ్రామంలో కుప్టి ఫీడర్ వద్ద 11కేవీ విద్యుత్ తీగ తెగిపడి రైతు సురుసే గోవిందరావుకు చెందిన ఎద్దు మృతిచెందింది. వ్యవసాయ పనుల్లో తోడుగా ఉండే ఎద్దు ఇలా విద్యుత్ ప్రమాదంతో మృత్యువాత పడడంతో కంటతడి పెట్టాడు. ఎద్దు విలువ రూ.80 వేల వరకు ఉంటుందని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని వేడుకున్నాడు. ఇలాంటి ఘటనలు పునారావృత్తం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

# పాఠశాలల్లో మౌలిక వసుతుల పనులు వేగవంతం చేయాలి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసుతుల పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో విద్యా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల మౌలిక సదుపాయాల పనుల్లో ఏ మాత్రం ఆలస్యం సహించబోమని అన్నారు. ప్రతి పనికి స్పష్టమైన టైమ్‌లైన్ ఖరారు చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఏంఈఓలు సూచించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. అలాగే ఖాన్ అకాడమీ విధానం ఉపాధ్యాయులకు బోధనను మరింత సులభతరం చేస్తుందని, దీనిపై పూర్తి అవగాహనతో తరగతుల్లో అమలు చేయాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్న చోట్ల వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి పీఎంశ్రీ సమీక్షలో భాగంగా ఈనెల 21న ఉన్నతాధికారులు జిల్లాకు రానున్నారని, బోథ్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో అవసరమైన ఏర్పాట్లను అత్యంత ప్రాధాన్యంగా చేపట్టాలని సూచించారు. పాఠశాల స్వచ్ఛత, భద్రత, మౌలిక వసతుల స్థితిపై సమగ్ర పరిశీలన చేసి ముందుగానే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి రాజేశ్వర్, సెక్టోరల్ అధికారులు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

- పీడిత ప్రజలకు అండగా ఎర్రజెండా
- కమ్యూనిస్టు పార్టీ స్ఫూర్తితోనే కొమురం భీం పోరాటం
- సీపీఐ శాసనసభా పక్ష నేత కూనం నేని సాంబశివరావు
- కొమురంభీం స్ఫూర్తితో పోరాటం : మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
- జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకు ప్రచార జాత ప్రారంభం



(జోడేఘాట్ నుంచి ఉద్యమ కెరటం ప్రత్యేక ప్రతినిధి)

కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, ఎర్రజెండా ఎల్లప్పుడూ పీడిత ప్రజలకు అండగా నిలబడుతుందని సీపీఐ శాసనసభా పక్ష నేత కూనం నేని సాంబశివరావు అన్నారు. శనివారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలంలోని జోడేఘాట్ లో జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకు ప్రచారజాతా ప్రారంభించారు. అంతకముందు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. బ్రిటిష్ పాలకులను దేశం నుండి తరిమికొట్టేందుకు సీపీఐ ఎనలేని పోరాటాలు చేశారని ఎంతోమంది కమ్యూనిస్టులు అమరవీరులయ్యారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాటాలు చేసేందుకు ఎర్రజెండా ఎల్లవేళలా ముందుంటుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ స్ఫూర్తితోనే కొమురం భీమ్ నైజాం సర్కార్ తో పోరాడారని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో మూడు జాతల ముగింపు ఉత్సవాలు ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని, డిసెంబర్ 26 తేదీన భారీ బహిరంగ సభకు ప్రజలు ప్రజాస్వామ్య వాదులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భూమి భుక్తి కోసం ఆనాడు పోరాటం చేసి సీపీఐ దేశంలో లక్షలాది ఎకరాలు భూమి పంచిందన్నారు. ఎంతోమంది పాలకులు మారిన నేటి వరకు భూమి సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆనాడు జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన కొమరం భీమ్ స్ఫూర్తితో జోడేఘాట్ లో ప్రచార జాతా ప్రారంభించడం జరిగిందన్నారు. కొమురం భీం స్ఫూర్తితో భూమి సమస్య, సాగునీరు తాగునీరు కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, రాష్ట్ర నాయకుడు బద్రి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి బద్రి సాయి కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి ఉపేందర్, ఉమ్మడి జిల్లా సీపీఐనాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# మతోన్మాద శక్తుల కుట్రలను తిప్పి కొట్టాలి

- ప్రశ్నించే గొంతుకలను పరిరక్షించుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** దేశంలో మతోన్మాద శక్తులు దేశ సమైక్యతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జోడేఘాట్ నుండి ప్రారంభమైన సీపీఐ ప్రచార జాతా ఆసిఫాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అవుతుందన్నారు. సీపీఐ నేతృత్వంలో వెట్టి చాకిరికి వ్యతిరేకంగా స్వాతంత్ర ఉద్యమంలో కమ్యూనిస్టులు పాల్గొని ఎంతోమంది అమరులయ్యారన్నారు. బానిసత్వం వద్దు దున్నేవాడికే భూమి అనే నినాదంతో సీపీఐ అనేక పోరాటాలు చేసి దేశంలో కోట్ల ఎకరాల భూమి పంచిన ఘనత ఉందన్నారు. భారత దేశంలో మతోన్మాద పాలకులు ప్రజల మధ్య చిచ్చు పెడుతూ అనేక హామీలతో అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అవుతున్న ఏ ఒక్క ఆర్ఎస్ఎస్ కార్యకర్త స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనలేదన్నారు. కానీ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నట్టు ఆర్ఎస్ఎస్ నాయకత్వం వక్రీకరించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలకులు ప్రశ్నించే గొంతుకలను నొక్కుతూ, రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పరిరక్షణ కోసం ఎల్లప్పుడు పోరాడుతుందని అన్నారు. మతోన్మాదానికి చెక్ పెట్టడానికి పిడికిలి బిగించాల్సిన సమయం అసన్నమైందని తెలిపారు. సీపీఐకి త్యాగ చరిత్ర ఉందని , ప్రజల స్వేచ్ఛ కోసం పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్‌రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ, సీపీఐ సీనియర్ నాయకుడు బద్రి సత్యనారాయణ, సీపీఐ జిల్లా అధ్యక్ష ,సహాయ కార్యదర్శి బద్రి సాయికుమార్, ఆత్మకూరి చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టుపల్లి సుధాకర్, నాయకులు అజయ్, మహేష్, రాకేష్ తోపాటు ఆర్టీసీ కార్మికులు, సివిల్ సప్లై హమాలీ కార్మికులు, మెడికల్ కాంట్రాక్టర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర ఉద్యమంలో పోరాడిన ఏకైక సీపీఐయే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి



దేశ స్వాతంత్ర ఉద్యమంలో పోరాడిన ఏకైక సీపీఐయేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. ఆర్ఎస్ఎస్ పాత్ర స్వాతంత్ర ఉద్యమంలో ఎక్కడ లేకపోయినా, దేశభక్తి అంటూ ప్రజలకు మభ్యపెట్టడం సిగ్గుచేటు అన్నారు. బిజెపి అధికారంలో రాక ముందు ఉద్యోగాలు ఇస్తామని, అనేక హామీలతో గద్దెనెక్కి హామీలు నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేసిందన్నారు. పీడిత ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని, ప్రజలు సీపీఐ పార్టీకు ఆదరణ ఇవ్వాలని కోరారు. డిసెంబర్ 26 న ఖమ్మం జిల్లాలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని,40 దేశాల కమ్యూనిస్టు పార్టీల నాయకులు సభకు హాజరవుతున్నట్లు తెలిపారు. సీపీఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాల బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

# ఘనంగా జర్నలిస్ట్ రాధాకృష్ణ చారి జన్మదిన వేడుకలు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ కవి, రచయిత చిలుకూరి రాధాకృష్ణ చారి జన్మదిన వేడుకలు టియూడబ్ల్యూజే (ఐజేయు) కార్యాలయంలో శనివారం రాత్రి ఘనంగా జరుపుకున్నా రు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, రాధాకృష్ణ చారి కు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ , టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా సంయుక్త కార్యదర్శి అబ్దుల్ హన్నన్ , ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ అహ్మద్ , బీజేపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ సోజర్ , పాత్రికేయుడు రాజ్ కుమార్ , నాయకులు షాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.






# బిర్సాముండా ఆశయాలు తరతరాలకు మార్గదర్శకం

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహా నాయకుడు బిర్సాముండా ఆశయాలు తరతరాలకు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ధర్తీ ఆబా (భూమిపిత) భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జన జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో బిర్సాముండా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రోజును జనజాతి గౌరవ దినోత్సవంగా ప్రకటించటం ఎంతో గర్వకారణమని అన్నారు. బ్రిటీష్ పాలన కాలంలోనే ఆదివాసీల హక్కులను కాపాడేందుకు ఆయన చేసిన పోరాటం అపూర్వమని గుర్తుచేశారు. ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. బిర్సాముండా ఆశయాల సాధన కోసం ప్రతిఒక్కరూ తమవంతు పాత్రను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, గిరిజన నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# ఆదివాసి స్వతంత్ర సమరయోధుడు బిర్సాముండ



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్ లో శనివారం బిర్సాముండా 150వ జయంతి వేడుకలను ఆదివాసీ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి నాయకులు బిర్సాముండ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ సంఘం మండల అధ్యక్షులు కోరేత తిరుపతి మాట్లాడుతూ బిర్సాముండా అతి చిన్న వయసులోని ఆంగ్లేయులపై పిడికిలి బిగించారని, ఆయన ధైర్యసాహస పోరాటాలు స్మరించుకుంటూ భారత ప్రభుత్వం జన్ జాతియ గౌరవ్ దివస్ గా ప్రకటించిందన్నారు. గిరిజనుల స్వాతంత్ర సమరయోధుడు ప్రజల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహనీయుడు అని తెలిపారు. భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన బిర్సాముండా చూపిన ధైర్యం, నిస్వార్ధ సేవా మార్గం గిరిజనుల గౌరవం అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం నిబద్ధతతో ముందుకుసాగిన పోరాటం నేటికీ మనకు ఆదర్శమని, ప్రతిఒక్కరు ఆయన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని ఆదివాసి చట్టాలను, హక్కులను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ ఆదివాసుల అభివృద్ధి కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం మండల గౌరవ అధ్యక్షులు సిడం సకారాం, కొలవార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్రం బక్కయ్య, కొలవార్ ఉపాధ్యక్షులు మనేపెల్లి మల్లేష్, కొలావార్ జిల్లా యువజన అధ్యక్షులు మెడి సతీష్, ప్రచార కార్యదర్శి కొరెత లలాయ, కొలవార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల శ్యామ్ రావు, కార్యవర్గ సభ్యులు కుర్సింగ శంకర్, పెద్దల శకర్, పోర్సేటి సర్దాజి, మల్లేష్, తోగయ, సిడం షణ్ముఖ, నాయిని స్వామి, కొలవార్ జిల్లా సహాయక కార్యదర్శి పోల్క వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పేధం తుకారాం, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

**ఉద్యమ కెరటం, వేములవాడ:** వేములవాడ రాజన్న దేవస్థాన అనుబంధ భీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం ముగుస్తున్న సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ పెరగడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పలు చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో రమాదేవి, పట్టణ సీఐ వీర ప్రసాద్ ఆలయ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. కోడె క్యూలైన్, ఉచిత దర్శనం, రూ.300 ప్రత్యేక దర్శనం, లడ్డు కౌంటర్, ప్రోటోకాల్ ఆఫీస్ వంటి ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అనే విషయంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎల్లా గౌడ్, డీఈ రఘునందన్, ఏఈఓ శ్రావణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అవినీతి అడ్డాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు!

## ఏసీబీ మెరుపు సోదాలు!



### లెక్కలు చూపని లక్షలాది నగదు సీజ్!


### డాక్యుమెంట్ రైటర్లు పరార్

### కొర్రీలు పెట్టి మధ్యవర్తులతో వసూలు!

**ఉద్యమ కెరటం, ప్రత్యేక ప్రతినిధి :** రిజిస్ట్రేషన్ల శాఖలో పాతుకుపోయిన అవినీతిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కొరడా ఝుళిపించింది. రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు ఒకే రోజు ఆకస్మిక సోదాలు నిర్వహించడం సంచలనం సృష్టించింది. అవినీతిపై వచ్చిన పక్కా సమాచారం ఆధారంగా ఈ మెరుపు దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఏకకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం రోజున మిర్యాలగూడ, మంచిర్యాల, పెద్దపల్లి, వైరా, పాలమూరు ప్రాంతాలలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. ఈ తనిఖీల్లో లెక్కకు చూపని భారీ మొత్తంలో నగదు లభించడం, రిజిస్ట్రేషన్ల కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయనడానికి నిదర్శనంగా నిలిచింది. సోదాలు నిర్వహించిన కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్ల వద్ద లెక్కలు చూపని నగదు లభించింది. అధికారులు ఈ నగదుకు సంబంధించిన వివరాలు అడగ్గా, వారు సమాధానం ఇవ్వలేకపోయారు. దీంతో ఏసీబీ అధికారులు ఆ నగదును సీజ్ చేశారు. ముఖ్యంగా, ఒక డాక్యుమెంట్ రైటర్ వద్ద ఏకంగా రెండు లక్షల రూపాయలకు పైగా అనధికార నగదు దొరికినట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి.

### పరారైన రైటర్లు

ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించగానే, చుట్టుపక్కల ఉన్న డాక్యుమెంట్ రైటర్లు, దళారులు, వారి షాపుల యజమానులు అప్రమత్తమై తమ షాపులను మూసివేసి పారిపోయారు. పలు చోట్ల డాక్యుమెంట్ రైటర్ల వద్ద కూడా నగదు స్వాధీనం చేసుకున్నారు.



## కొర్రీలు పెట్టీ.. మధ్యవర్తులతో వసూలు!

రాష్ట్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొంత సమయం పడుతుంది. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయడానికి సబ్ రజిస్ట్రార్ కార్యాలయ అధికారులు మధ్యవర్తులతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆస్తి యొక్క మార్కెట్ విలువ కంటే డాక్యుమెంట్లలో తక్కువ విలువ (సర్కార్ వాల్యూ) చూపించడానికి సహకరించడం. దీనివల్ల కొనుగోలుదారులు స్టాంప్ డ్యూటీ ,రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నును తప్పించుకుంటారు. ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్న భూములను, లేదా వివాదాస్పద భూములను రిజిస్టర్ చేయడానికీ, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) వంటి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డాక్యుమెంట్లను సైతం లంచాలు తీసుకుని రిజిస్టర్ చేయడం. మార్కెట్ వాల్యుయేషన్ సర్టిఫికెట్లను సకాలంలో జారీ చేయడానికి లేదా నిర్దిష్ట (తక్కువ) విలువ చూపడానికి అక్రమ వసూళ్లకు పాల్పడటం.



డాక్యుమెంట్లలో మార్పులు/ఫైళ్ల క్లియరెన్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో చిన్నచిన్న లోపాలను సరిదిద్దడానికి లేదా ఏదైనా డాక్యుమెంట్‌ను పెండింగ్ లో పెట్టకుండా క్లియర్ చేయడానికి, పాత రికార్డులు/ఫైళ్లను పరిశీలించడానికి లేదా కాపీలు ఇవ్వడానికి కూడా ఇబ్బందులు పెట్టి అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు అనేక ఆరోపణాలు ఉన్నాయి.

### అవినీతిపై పక్కా సమాచారం

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయడం, ప్రతి పనికి లంచాలు వసూలు చేయడం, సామాన్య ప్రజల నుంచి అదనంగా డబ్బులు గుంజడం వంటి అవినీతి కార్యకలాపాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విచ్చలవిడిగా జరుగుతున్నాయన్న పక్కా సమాచారం ఏసీబీ ఉన్నతాధికారులకు అందింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు పలు జిల్లాల్లో ఈ దాడులు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని అవినీతికి సంబంధించిన కీలక దస్త్రాలు, డాక్యుమెంట్లు, అనుమానాస్పద లావాదేవీల రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లపై కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై ప్రజలు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని, అవినీతికి పాల్పడే ఏ అధికారిని, సిబ్బందిని ఉపేక్షించేది లేదని ఏసీబీ అధికారులు తెలిపారు. పారదర్శకమైన రిజిస్ట్రేషన్ వ్యవస్థను నెలకొల్పేందుకు కృషి చేస్తాం అని ఏసీబీ అధికారులు తెలిపారు.

# కలెక్టరేట్ ఎదుట పత్తి రైతుల ధర్నా

### ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులపై విధిస్తున్న ఆంక్షలకు వ్యతిరేకంగా రైతు జేఏసీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యాం నాయక్ లు హాజరై తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో అధిక తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడాన్ని తక్షణమే ఆపాలి అని డిమాండ్ చేశారు. రైతులను వేధిస్తున్న 'కపస్ కిసాన్' యాప్‌ను రద్దు చేయాలి అని, అలాగే ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి కొనుగోలు నిబంధనను కూడా వెంటనే తీసివేయాలి అని స్పష్టం చేశారు. అధిక వర్షాల కారణంగా నష్టపోయిన పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తి రైతులపై విధిస్తున్న అన్ని రకాల ఆంక్షలను తక్షణమే ఎత్తివేసి, వారికి న్యాయమైన ధర కల్పించాలని, అలాగే కొనుగోలు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని రైతు జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, రైతు జేఏసీ నాయకులు డా. రమేష్, జయరామ్, ప్రణయ్, జక్కయ్య, ప్రభాకర్, మారుతి నిసార్, అర్షాద్, దీపక్ తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.





